క్లుప్తంగా

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి


మాట్లాడుతున్న జయరాజు

ఇల్లెందు: అన్ని యాజమాన్యాల కింద గల పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.జయరాజు, మండల అధ్యక్షుడు ఏ.రాంబాబు కోరారు. బుధవారం ఇల్లెందులోని పెన్షనర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని విన్నవించారు. గిరిజన సంక్షేమశాఖలోని ఆశ్రమ పాఠశాలల సీఆర్టీలకు, సింగరేణి ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు మినియం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మైనారిటీ గురుకులంలో ప్రవేశాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

ఇల్లెందు: తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు అడ్మీషన్లు పొంది సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.రవికుమార్ అన్నారు. బుధవారం ఇల్లెందు తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్‌తో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ రెండు గ్రూపులు ఉన్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు టెన్త్ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ప్రభుత్వం మేలైన విద్యను అందిస్తున్నందున ఉచిత విద్యను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్, అధ్యాపకులు కొండల్‌రావు, అశోక్, హరీష్, పీడీ నజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్ వర్కర్స్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన కమిటీ సభ్యులు

టేకులపల్లి: పెయింటింగ్స్ వర్కర్స్ యూనియన్ టేకులపల్లి మండల నూతన కమిటీ ఎన్నిక మండల కేంద్రంలో జరిగింది. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పెయింటింగ్ వర్కర్స్ సర్వసభ్య సమావేశంలో పెయింటర్ల సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా బండారి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా పోలెపొంగు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా గారె పృథ్వీ, గౌరవ అధ్యక్షుడిగా భూక్యా లక్ష్మణ్, గౌరవ సలహాదారులుగా దయాకర్, కమలాకర్, భావ్‌సింగ్, కార్యదర్శులుగా ధరావత్ వెంకట్, పోలెపొంగు వెంకటేశ్వర్లు, జమాల్, నరసింహారావు, శంకర్, నవీన్, ప్రసాద్, అన్వేష్, శ్రీను, కోటేష్, కోశాధికారిగా బండారి మధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన సెలవు ఉంటుందని, పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే ఇంటి యజమానే బాధ్యత వహించాలని, ప్రతీ పెయింటర్ యూనియన్ కార్డు, లేబర్ లైసెన్స్ తీసుకోవాలని, ప్రమాద బీమా చెల్లించుకోవాలని తీర్మానం చేశారు.

సీపీఐ(ఎంఎల్)లో చేరిక


మాస్‌లైన్ అనుబంధ ఇఫ్టూలో చేరిన హమాలీలు

ఇల్లెందు: ఎస్టీ చంద్రన్న వర్గం హమాలీ రైస్ మిల్ కార్మికులు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్‌లో చేరారు. బుధవారం మాస్‌లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు హమాలీ, రైస్‌మిల్‌లో పని చేస్తున్న కార్మికులు... రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ, జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ ఆధ్వర్యంలో ఇఫ్టూలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో మీసాల వెంకన్న, నరేష్, కోటయ్య, శంకర్, చీమల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.


ఇల్లెందురూరల్: ముత్తారపుకట్ట గ్రామ పంచాయతీ పాలకవర్గం


జూలూరుపాడు: భోజ్యాతండా సర్పంచ్ కిషన్‌లాల్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు


పాల్వంచరూరల్: ఎంపీపీ సరస్వతిని సత్కరిస్తున్న సర్పంచ్‌లు

ముగిసిన సర్పంచ్‌ల పాలన

జూలూరుపాడు: గ్రామ సర్పంచ్‌ల పదవీకాలం బుధవారంతో ముగిసింది. దీంతో పలువురు సర్పంచ్‌లను ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా సన్మానించారు. స్థానిక హైస్కూల్‌లో జూలూరుపాడు సర్పంచ్ గుండెపిన్ని విజయ, వెంకటేశ్వర్లు దంపతులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు. భోజ్యాతండా గ్రామ సర్పంచ్ లావుడ్యా కిషన్‌లాల్‌ను ఎంపీపీ లావుడ్యా సోనీ, గ్రామస్తులు సన్మానించారు.
సుజాతనగర్: ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న సర్వారం సర్పంచ్ బాదావత్ శారదతో పాటు, వార్డు సభ్యులను ఆ గ్రామ ప్రజలు బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.
పాల్వంచరూరల్: ఐదేళ్ల పాటు గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌లు అందించిన పాలన అభినందనీయమని ఎంపీడీఓ అప్పారావు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు కొనియాడారు.
స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని 36 గ్రామపంచాయతీ సర్పంచ్‌ల పదవీ విరమణ సందర్భంగా అధికారులు, ఎంపీటీసీలు సర్పంచ్‌లను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంచాయతీ ఎన్నికలు జరిగే వరకు పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతుందన్నారు. ఎంపీఓ నారాయణ, ఏపీఓ రంగా, ఎంపీపీ మడవి సరస్వతి, వైస్ ఎంపీపీ గురవయ్య స్థానికులు పాల్గొన్నారు.
ఇల్లెందురూరల్: ఐదేళ్లు ప్రజా సేవ చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నామని, ప్రజలకు అనుగుణంగా మెరుగైన అందించామని మండలంలోని ముత్తారపుకట్ట సర్పంచ్ మంకిడి కృష్ణ అన్నారు. బుధవారం గ్రామపంచాయతీ పాలకవర్గం చివరి సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పరిధిలో అవకాశం ఉన్నంత వరకు సీసీ రోడ్లు వేశామని, వైకుంఠధామం, కంపోస్టు షెడ్డు, పల్లె ప్రకృతి వనం, తాగునీటి పథకాలు, గ్రామపంచాయతీ భవనం, పాఠశాల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలు మా పాలనలో అభివృద్ధి చెందడం ఆనందంగా ఉందన్నారు. ఐదేళ్లలో ప్రజలు, అధికారుల సహకారం మరువలేనిదన్నారు. అనంతరం గ్రామస్తులు పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


సుజాతనగర్ సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించిన గ్రామస్తులు


జూలూరుపాడు సర్పంచ్ విజయ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పల్లెల్లో మౌలిక వసతులు కల్పిస్తాం..

ఇల్లెందురూరల్: ప్రతీ పల్లెలో మౌలిక వసతులు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో రూ.30 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, బాలాజీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20 లక్షల వ్యయంతో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ఆరు గ్యారెంటీలపై ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని సూచించారు. ధరణి వల్ల అనేక మంది రైతులు తమ భూములకు పట్టాలు పొందలేకపోయారని, ప్రభుత్వం ధరణిలో మార్పులు చేసేందుకు చర్యలు తీసుకుంటోందని, త్వరలోనే ప్రతీ రైతుకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చీమల వెంకటేశ్వర్లు, పాయం స్వాతి, కల్తి పద్మ, ఎంపీటీసీలు మండల రాము మహేష్, పూనెం సురేందర్, మెట్టెల శిరోమణి, పాయం కృష్ణప్రసాద్, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పులి సైదులు, మోకాళ్ల వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

వివాదాస్పద స్థలం పరిశీలన


స్థల వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ శిరీష

చుంచుపల్లి: మండలంలోని నందాతండా గ్రామ పంచాయతీ పరిధిలో కోర్టు వివాదంలో ఉన్న స్థలాన్ని కొత్తగూడెం ఆర్డీఓ శిరీష బుధవారం మండల అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్థలం పూర్తి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు విచారణలో ఉన్న డబ్ల్యూపీ నంబర్ 5716/2013, 7106/ 2014 కర్రి కోటేశ్వరరావు, మాలోత్ శ్రీను, కె.అన్నపూర్ణ, మర్రిపాటి వెంకట నరసింహారావులకు సంబంధించిన 14.8 ఎకరాల వివాదాస్పద స్థలం విషయం హైకోర్టులో వ్యాజ్యం నడుస్తున్నందున ఇటీవల కలెక్టర్‌ను స్వయంగా హాజరు కావాల్సిందిగా హైకోర్టు ఆదేశించడంతో ఆమె కోర్టు హాజరయ్యారు. హైకోర్టు జడ్జి సూచనల మేరకు కలెక్టర్ స్వయంగా ఈ కేసును పరిశీలించి నివేదికను సమర్పించవలసిందిగా కోరారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ శిరీష నేతృత్వంలో తహసీల్దార్ కృష్ణ, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ కుసుమ, మండల పంచాయతీ అధికారి గుంటి సత్యనారాయణ, ఆర్ఐ గన్యా నాయక్, పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, సత్యనారాయణ, మదార్ బాష తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ 'కొత్వాల'కు సన్మానం

పాల్వంచరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్ర మార్కెటింగ్ సహకార సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన కొత్వాల శ్రీనివాసరావును బుధవారం పాల్వంచ మండల ప్రజాప్రతినిధులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ మడవి సరస్వతి, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, బీఆర్ఎస్ నాయకులు రాజు, ఉపసర్పంచ్ శేఖర్, సర్పంచ్ విజయ్‌కుమార్, పెద్దమ్మగుడి డైరెక్టర్ ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.


కొత్వాలను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు

అంకితభావంతో పనిచేయాలి


కార్యదర్శులను సన్మానిస్తున్న ఎంపీడీఓ బాలరాజు, కార్యదర్శులు

ఇల్లెందురూరల్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే గుర్తించబడతారని ఎంపీడీఓ బాలరాజు అన్నారు. గణతంత్ర వేడుకల్లో ఉత్తమ కార్యదర్శులుగా ప్రశంసా పత్రాలు అందుకున్న మామిడిగుండాల కార్యదర్శి యాకరాజు, పోలారం కార్యదర్శి ఉప్పు దీప్తిలను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో కార్యదర్శులు బాగా పనిచేయడం వల్ల ఇల్లెందు మండలాని జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇదే ఒరవడిని ప్రతీఒక్కరూ కొనసాగించి భవిష్యత్‌లో మరింత బాగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏరియాలో 103శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో జనవరికి నిర్దేశించిన 11.19 లక్షల టన్నుల్లో 11.55 లక్షల టన్నుల(103 శాతం) బొగ్గు ఉత్పత్తి నమోదైందని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు తెలిపారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఏరియాలోని వీకే-7 ఓసీకి సంబంధించి 29 లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించినా అనుమతులు రాలేదని, ఫలితంగా ఏరియా వెనుకంజలో ఉందని తెలిపారు. దీన్ని పక్కన పెడితే ఏరియా సింగరేణిలో అగ్రస్థానంలో నిలుస్తుందని పేర్కొన్నారు. కాగా, జేవీఆర్ సీహెచ్‌పీ ద్వారా 228 వ్యాగన్లు, రుద్రంపూర్ కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్ ద్వారా 41 వ్యాగన్లు కలిపి 269 వ్యాగన్ల ద్వారా 128.11 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధికారులు కోటిరెడ్డి, రామకృష్ణ, కె.హన సుమలత, రమేష్, యోహాన్, రవీందర్, తావురియా, శివకేశవరావు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 5నుంచి 11వ తేదీ వరకు కొత్తగూడెం ఏరియాలో ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణాపై మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్ పర్యవేక్షణ ఉంటుందని జీఎం తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక బృందాలు ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణాపై సమీక్షిస్తారని పేర్కొన్నారు.

నరసింహారావుకు శుభాకాంక్షలు


నరసింహారావును సన్మానిస్తున్న నాయకులు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన అరిగెల నరసింహారావు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నరసింహారావును ఆ పార్టీ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బానోత్ నవీన్ రాథోడ్, ధర్మరాజుల వెంకటనారాయణ, భూక్యా అమ్మ, మద్దిశెట్టి వంశీ, బాదావత్ రమేష్, ముళ్లపాటి అప్పారావు, రావుట్ల నరేష్, ఆదినారాయణ, రంజిత్ కుమార్, సాయి, చెన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక


వినోద్‌రావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న కిషన్‌రెడ్డి

పాల్వంచరూరల్: ప్రముఖ సామాజిక, పారిశ్రామిక వేత్త, ఏకలవ్య ఫౌండేషన్ డైరెక్టర్ పాల్వంచకు చెందిన తాండ్ర వినోద్‌రావు బుధవారం ఢిల్లీలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. అదేవిధంగా స్థానిక పట్టణానికి చెందిన ప్రముఖ ఇంజనీర్ లట్టి మురళీ బుధవారం కొత్తగూడెంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎంఎల్‌సీ రామచంద్రరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, కేవీ రంగాకిరణ్ సమక్షంలో బీజేపీలో చేరారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె నోటీస్


టేకులపల్లి: కేఓసీలో పీఓ ప్రహ్లాద్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న జేఏసీ నాయకులు

ఇల్లెందు: ఈ నెల 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు జీఎం జాన్ ఆనంద్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. బుధవారం ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ ఆధ్వర్యంలో జీఎంకు సమ్మె నోటీస్ అందజేసి కార్మికులు సమ్మెలో పాల్గొననున్నట్లు తెలిపారు. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు.
టేకులపల్లి: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనం రూ.26,000, కార్మిక చట్టాల స్థానంలో తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతులకు నష్టం చేసే చట్టాలను వెనక్కి తీసుకోవాలని ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరగనున్న గ్రామీణ, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు షేక్ యాకుబ్ షావలీ, గుగులోత్ రాంచందర్, డి.ప్రసాద్, కుంజ రమేష్ నెల్లూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం కోయగూడెం సింగరేణి ప్రాజెక్టు కార్యాలయంలో పీఓ ప్రహ్లాద్‌కు, ఎల్ఎస్ఎన్ ఓబీ యాజమాన్యం రాజమోహన్‌రెడ్డిలకు సమ్మె నోటీసులు అందజేశారు. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ఐక్యంగా కదలాలని పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని విచ్ఛిన్నం చేసి, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను తిప్పికొట్టాలన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాపిత సమ్మెలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాయం వెంకన్న, రాయన్న కోటిలింగం, రామ్‌కుమార్, సైదులు, శేఖర్, వేణు, మంగ్యా తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులకు సన్మానం


డిప్యూటీ సూపరింటెండెంట్ రమేష్‌ను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు


కార్మికులను సన్మానిస్తున్న గని మేనేజర్ శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో సుమారు 37 సంవత్సరాలు పనిచేసి బుధవారం ఉద్యోగ విరమణ పొందిన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆర్.రమేష్‌ను కార్పొరేట్ కార్యాలయంలో పలు విభాగాల అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. జీఎంలు బసవయ్య, (వెల్ఫేర్ అండ్ ఆర్సీ), బి.హనమంతరావు (ఐఆర్ పీఎం), వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.
కార్మికులకు... పీవీకే-5 ఇంక్‌లైన్‌లో ఉద్యోగ విరమణ పొందిన కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి కూసన వీరభద్రయ్య, సత్యనారాయణ (కోల్‌కట్టర్), హరిసింగ్ (కోల్ కట్టర్)లను గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అండర్ మేనేజర్లు అరుణ్, శ్రావణ్, అంకెం రాజయ్య, ఎస్.నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఆరే రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యసేవలు అందేనా?

- మూతపడిన డెంటల్ యూనిట్
- పీహెచ్‌సీలో నిరుపయోగంగా యంత్ర పరికరాలు


జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో డాక్టర్ లేకపోవడంతో 2020 – 2022 వరకు కరోనా కారణంగా మూడేళ్లపాటు డెంటల్ యూనిట్ మూతపడింది. తిరిగి జనవరి 12, 2023న దంత వైద్యురాలు ప్రదీప్తిని నియమించడంతో దంత సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత డిసెంబర్ నుంచి దంత వైద్యురాలు విధులకు రాకపోవడంతో మళ్లీ దంత వైద్యసేవలు నిలిచిపోయాయి. రూ.లక్షల విలువైన యంత్రపరికరాలు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం పీహెచ్‌సీని సీహెచ్‌సీ భవనంలోనే నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్‌లో భాగంగా 2016–2017లో దంత వైద్యుడితోపాటు, మరో నలుగురు మెడికల్ ఆఫీసర్లు, ఐదుగురు స్టాఫ్ నర్సులు, ఒక హెడ్ నర్స్‌ను ప్రభుత్వం నియమించింది. ఆనాటి నుంచి సీహెచ్‌సీగా కొనసాగుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో అప్‌గ్రేడ్ చేయకపోవడంతో పీహెచ్‌సీ స్థాయి వైద్యసేవలే అందుతున్నాయి. ఇదే భవనంలో ఒక గదిని కేటాయించి సెప్టెంబర్, 2019లో సుమారు రూ.10 లక్షలతో ఖర్చు చేసి డెంటల్ యూనిట్‌ను నెలకొల్పారు. పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) కింద పనిచేసే దంతవైద్యుడు పోటు వినోద్ జనవరి, 2020 వరకు దంత వైద్య సేవలు అందించారు. ఆనాటి కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ జూలూరుపాడు పీహెచ్‌సీలో డెంటల్ యూనిట్ ఏర్పాటు చేయాలని దంత వైద్యుడు వినోద్ విజ్ఞప్తి మేరకు డెంటల్ మిషన్‌కు రూ.7.50 లక్షలు మంజూరు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ఏ ప్రభుత్వ ఆస్పత్రిలో లేని డెంటల్ మిషన్ జూలూరుపాడు పీహెచ్‌సీ డెంటల్ యూనిట్‌లో నెలకొల్పడంతో ప్రజలు సంతోషించారు. అయితే దంతవైద్యుడు పోటు వినోద్‌కు పీహెచ్‌సీ డీడీఓగాను, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించడంతో నామమాత్రపు సేవలకే పరిమితం అయింది. కరోనా అనంతరం దంతవైద్యుడు వినోద్ యాదాద్రి భువనగిరి జిల్లాకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. గత ఏడాది జనవరిలో కొత్తగూడెం ప్రధానాస్పత్రిలో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్‌గా కంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న దంత వైద్యురాలు ప్రదీప్తిని జూలూరుపాడు పీహెచ్‌సీకి డిప్యూటేషన్ వచ్చారు. పీహెచ్‌సీలో డెంటల్ యూనిట్ ఉండటంతో ఆమె దంత వైద్యనిపుణురాలు (ఎండీఎస్) కావడంతో పది నెలలు సజావుగానే దంతవైద్య సేవలు అందించారు. 45 రోజులుగా దంత వైద్యురాలు ప్రదీప్తి విధులకు హాజరు కాకపోవడంతో మళ్లీ దంతవైద్య సేవలు నిలిచిపోయాయి. స్థానిక పీహెచ్‌సీలోని డెంటల్ యూనిట్‌ను ఇక్కడ నుంచి మరో చోటకు తరలించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. స్థానిక డెంటల్ యూనిట్‌ను తరలించకుండా రెగ్యులర్ డెంటిస్ట్‌ను నియమించి, దంత వైద్యసేవలు అందించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


నిరుపయోగంగా డెంటల్ యంత్ర పరికరాలు

రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి



డెంటల్ యూనిట్‌కు రెగ్యులర్ డాక్టర్‌ను నియమిస్తే దంత వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో బాధితులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. దంత వైద్యురాలు రెండు నెలలుగా విధులకు హాజరు కాకపోవడంతో సేవలు నిలిచిపోయాయి.

– బానోత్ ధర్మా


అధికారులు చర్యలు తీసుకోవాలి



మూతపడిన డెంటల్ యూనిట్‌ను తెరిచేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రారంభం నుంచే వైద్యసేవలు సక్రమంగా అందడం లేదు. డాక్టర్ వినోద్ డిప్యూటేషన్‌పై వెళ్లడంతో, దంత వైద్యురాలు ప్రదీప్తి డిప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చారు. ఇప్పుడు ఆమె కూడా రావడం లేదు.

– ఎస్కే చాంద్‌పాషా

త్వరలో డాక్టర్‌ను నియమిస్తాం..



అతి త్వరలో దంత వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. జూలూరుపాడు పీహెచ్‌సీలో డిప్యూటేషన్‌పై ఉన్న దంత వైద్యురాలు ప్రదీప్తి అనారోగ్యంతో హాజరు కావడం లేదు. త్వరలో విధుల్లో చేరతారు. లేదంటే వేరే వారిని నియమిస్తాం.

– డాక్టర్ రాకేష్ కుమార్, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ, జూలూరుపాడు